జాతర ఏర్పాట్లు పర్యవేక్షించాలి

జాతర పనులను ప్రారంభించిన ఆలయ చైర్మన్ నారాయణశర్మ, ఈఓ కట్టా సుధాకర్‌రెడ్డి

కీసర, ఫిబ్రవరి 14:కీసరగుట్ట జాతరలో జరిగే పనులను అధికారులే దగ్గరుండి జాతర ఏర్పాట్లను పర్యవేక్షించి పొరపాట్లు జరుగకుండా చూడాలని కీసరగుట్ట ఆలయ చైర్మన్ తటాకం నారాయణశర్మ తెలిపారు. కీసరగుట్టలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జాతర ఏర్పాట్లను ఆలయ చైర్మన్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ..ఈనెల 24 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు జరిగే జాతరకు లక్షలాది మంది భక్తులు కీసరగుట్టకు వస్తారన్నారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో క్లీనింగ్‌తో పాటు భక్తులకు ఉపయోగపడే బాత్‌రూంలు, షెడ్‌లు వేసుకోవడానికి స్థలాన్ని జేసీబీతో చదును చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఏఈ జగపతిబాబు, కీసరగుట్ట ఈఓ కట్టా సుధాకర్‌రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలకు దూరంగా ఉండాలి

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై వెంకట్‌రెడ్డి

కీసర, ఫిబ్రవరి 14:ఆన్‌లైన్‌లో జరిగే ఆర్థిక మోసాలకు దూరంగా ఉండాలని ఎస్సై వెంకట్‌రెడ్డి తెలిపారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని చీర్యాల్ గ్రామంలో చైతన్య యూత్ క్లబ్ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్‌పై పోలీసులు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ..ఆన్‌లైన్‌లో జరిగే ఆర్థిక మోసాలకు చాలా మంది గురవుతున్నారని, బాధితులు ఆలస్యం చేయకుండా 1930కి కాల్ చేయాలని సూచించారు. తదితర నేరాలపై యూత్ వారికి వివరించారు. కార్యక్రమంలో నేతలు కోల కృష్ణయాదవ్, మాజీ సర్పంచ్ తుంగ ధర్మేందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

పోచారం,ఫిబ్రవరి14: పోచారం మున్సిపాలిటీ నారపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఈనెల 15న విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి 2గంటల వరకు మహాలక్ష్మిపురం, సురేందర్‌రెడ్డి నగర్, సప్తగిరికాలనీ,బాబానగర్, గణేశ్‌నగర్, 3 నుంచి 3:30 వరకు వెంకటాద్రి టౌన్‌షిప్, చౌదరిగూడ, విజయపూరికాలనీ, శివాజీ నగర్, ఓయూకాలనీ, ఏకశిలనగర్, సుబ్రభాత్‌టౌన్‌షిప్, సిద్ధార్థ కాలనీ, సబ్‌స్టేషన్ ప్రాంతం, 2నుంచి 2:30వరకు అన్నోజిగూడ, లక్ష్మీనర్సింహ్మకాలనీ, ఇందిరానగర్, సాయి నగర్, వెంకటా సాయి నగర్, సత్యనగర్, జయపురి కాలనీ, అన్నోజిగూడ పాత గ్రామం ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

స్కాలర్‌షిప్‌కు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎంపిక

స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులను సత్కరిస్తున్న, మాజీ చైర్మన్ చంద్రారెడ్డి, ప్రధానోపాధ్యాయులు రాములు

మేడ్చల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 14:నేషనల్ మీన్స్ – కమ్–మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ ఎంఎంఎస్)కు జాతీయస్థాయి పరీక్షలో నాగారం జిల్లా పరిషత్ విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. శుక్రవారం పాఠశాలలో ఎంపికైన విద్యార్థులు త్యోషన్ రత్నం, ప్రజ్వల, చందనలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. 8వ తరగతి నుంచి ఇంటర్ పూర్తయ్యే వరకు స్కాలర్‌షిప్ పొందుతారు. శిక్షణ ఇచ్చిన మాలోత్ నాయక్, ఉపాధ్యాయులు అరవింద్ కుమార్,వనజ, రాజ్యలక్ష్మి, శ్రీదేవి, పాండు రంగారెడ్డి, అజీజ్ అహ్మద్, రఘు వందన, వరమ్మ, నాయక్, సరిత, పద్మ, సుమతి, కమల, గాయత్రీ సంజయ్ రాణి, సత్యశ్రీ, సంధ్యారాణి, వలంటీర్స్ స్వప్న, శ్రీ విద్య, అల్కాలను హెచ్ఎం రాములు అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్‌తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

నాగారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కండ్ల అద్దాలు అందజేస్తున్న చంద్రారెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్, ఫిబ్రవరి14:విద్యార్థుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు శ్రద్ధ పెట్టాలని నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు.నాగారం జిల్లా పరిషత్ పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు చెవి, ముక్కు, గొంతు, కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి కంటి అద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. చక్కగా చదువుకుని వృద్ధిలోకి రావాలని, మంచిని పది మందిలో తెలియజేయాలని సూచించారు. రాంపల్లి, జవహర్ నగర్,దమ్మాయిగూడ లాంటి పాఠశాలలో కూడా సేవలు అందించాలని లయన్స్ క్లబ్ వారిని కోరారు. కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు రాములు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కత్తితో బెదిరింపు.. ఒకరిపై కేసు

మల్కాజిగిరి, ఫిబ్రవరి 14: కత్తితో బెదిరించిన ఒకరిపై కేసు నమోదైన సంఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం ప్రకారం.. మౌలాలి ముస్లింజంగ్ కాలనీలో ముక్రం అలియస్ పప్పు రోడ్డుకు అడ్డంగా నిలబడి అటుగా వెళ్తున్న వారిని కత్తితో బెదిరించాడు. మొహమ్మద్ అమీనుద్దీన్, మోసిన్, సల్మాన్, బాబర్‌లను కావాలని ఆపి ముక్రం అలియాస్ పప్పు బూతులు తిడుతూ చాకుతో వారిని బెదిరించాడు. వీరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నేరేడ్‌మెట్, ఫిబ్రవరి 14 : బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. శుక్రవారం నేరేడ్‌మెట్ డివిజన్ శ్రీకాలనీలో నివాసం ఉంటున్న బీఆర్ఎస్ పార్టీ మాజీ కార్పొరేటర్ బద్దం పుష్పలతా రెడ్డి నివాసానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ .. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా కృషి చేయాలని తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అఖండ విజయం సాధించాలన్నారు. పార్టీ పటిష్టతకు పాటుపడే ప్రతి కార్యకర్తకు సముచిత ప్రాధాన్యత దశల వారీగా కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బద్దం పరశురాంరెడ్డి , కార్పొరేటర్ మురుగేష్, హేమంత్ రెడ్డి, నర్సింగ్, బాలకృష్ణ గుప్త, ఫరీద్, ప్రభాకర్ రెడ్డి, అరున్, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వినాయకనగర్ మాజీ కార్పొరేటర్ బద్దం పుష్పలతారెడ్డి తదితరులు

కాంగ్రెస్ తులం బంగారం హామీని నిలబెట్టుకోవాలి

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే బండారి

లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా, ఫిబ్రవరి 14: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో నిరు పేద కుటుంబాలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం కాప్రా తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ సుచరితతో కలిసి ఎమ్మెల్యే 38మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు సంబంధించిన రూ.38 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు ఇచ్చిన 1 లక్షా 116 రూపాయలతోపాటు తులం బంగారం ఇస్తామని హామీనిచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం.. లబ్ధిదారులకు అందజేయాలని, పేదింటి ఆడపడచులకు ఎంతో ఆసరాగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు స్వర్ణరాజు, ప్రభుదాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానల్లో డీఎంహెచ్‌వో తనిఖీ

మేడ్చల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 14 : కీసర, దమ్మాయిగూడ పరిధిలోని బస్తీ దవాఖానాలను, ఆరోగ్య కేంద్రాలను శుక్రవారం డీఎంహెచ్‌వో డాక్టర్ సీ. ఉమా గౌరి తనిఖీ చేశారు. దమ్మాయిగూడ పాత గ్రామం, రాజీవ్ గృహకల్పలో ఉన్న బస్తీ దవాఖానాలు, కీసరలోని సబ్‌సెంటర్, వెల్‌నెస్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రాల్లోని అవుట్‌పేషెంట్ (ఓపీ) , ఫార్మసీ రిజిష్టర్లను తనిఖీ చేశారు. రోగులతో ప్రత్యక్షంగా మాట్లాడి అందిస్తున్న సేవల గురించి, మందుల లభ్యత గురించి వివరంగా అడిగి తెలుసుకున్నారు. కీసర నిర్మాణంలో ఉన్న ఆరోగ్య , వెల్నెస్ సెంటర్లను సందర్శించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్, ఆర్ అండ్ బీ సిబ్బందితో చర్చించారు. పెండింగ్‌లో ఉన్న ఎలక్ట్రికల్ పనులు, బోరుబావి తవ్వకాన్ని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. పరిశీలన సందర్భంగా పల్లె దవాఖానా కోసం కేటాయించిన భూభాగంలో ఆక్రమణ జరిగినట్లు గుర్తించామని డీఎంహెచ్‌వో తెలిపారు. ఈ విషయమై డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, పీహెచ్‌సీ అధికారి నివేదిక ఇవ్వాలని కోరారు.

దమ్మాయిగూడ పాత గ్రామంలోని రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో ఉమాగౌరి

గురుకుల్‌ను అభివృద్ధి చేసి నియామకాలు చేపట్టాలి

ఘట్‌కేసర్ గురుకుల్ విద్యాలయంలోని జ్ఞాన మందిరం

ఘట్‌కేసర్‌లోని గురుకుల్ విద్యాలయం

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 14:ఘట్‌కేసర్ పట్టణంలోని గురుకుల్ విద్యాలయాన్ని అభివృద్ధి చేయడంతోపాటు నియామకాలు చేపట్టి, విద్యార్థుల సంఖ్యను పెంచాలని కోరుతూ దేవాదాయ, ధర్మాదాయశాఖ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రెటరీకి ఘట్‌కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్ శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఘట్‌కేసర్ పట్టణంలో పేద విద్యార్థులకు ఉన్నతమైన విద్యనందించాలనే మహోన్నత ఆశయంతో బన్సీలాల్ వ్యాస్‌జీ 1938లో గురుకుల్ పాఠశాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పాఠశాలకు నగరంలోని మాదాపూర్, హై టెక్ సిటీ ప్రాంతాల్లో 627 ఎకరాలు, నాండెడ్‌లో 4ఎకరాలు, ఘట్‌కేసర్‌లో 26 ఎకరాలు ఏర్పాటు చేసి పేద విద్యార్థుల అభ్యున్నతికి ఉచిత హాస్టల్‌ను ఏర్పాటు చేసినట్లు వినతిలో పేర్కొన్నారు. అనివార్యంగా 1989లో దేవాదాయ శాఖకు గురుకుల్ సంస్థను అప్పగించగా.. ఎంతో వైభవంగా ఉన్న విద్యాలయం భిక్షాటన చేయాల్సిన దుస్థితి ఏర్పడినట్లు ఆరోపించారు. పేద విద్యార్థులు దేవునితో సమానమని, వారి అభ్యున్నతే లక్ష్యంగా గురుకుల్ విద్యా సంస్థను ఏర్పాటు చేసిన మహానీయుడు బన్సీలాల్ వ్యాస్ జీ కలలను నిజం చేసేందుకు తాము ఉత్తరాల ఉద్యమం చేపట్టినట్లు తెలిపారు. గురుకుల్ విద్యా సంస్థకు పూర్వ వైభవం సంతరించుకునేలా అభివృద్ధిపర్చడంతోపాటు ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాలని, విద్యార్థుల సంఖ్యను పెంచి ఉచిత హాస్టల్ వసతిని తెరువాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్రప్రభుత్వానికి అప్పగించి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు.

పాలమూరు వలస కూలీలకు నీటి కష్టాలు

కూలీకి వెళ్లకుండా నీటి ట్యాంకర్ కోసం ఎదిరి చూపులు

మల్కాజిగిరి, ఫిబ్రవరి 14:పాలమూరు వలస కూలీలకు నీటి కష్టాలు తప్పడం లేదు. అల్వాల్ సర్కిల్ వెంకటాపురం డివిజన్ భూదేవినగర్‌లోని రైల్వే ట్రాక్ కట్ట వద్ద పాలమూరు నుంచి వలస వచ్చిన దాదాపు వంద కుటుంబాలు గుడిసెలు వేసుకుని ఉంటున్నారు. రోజు కూలీ చేస్తూ జీవిస్తున్నారు. ఇక్కడ దాదాపు వంద కుటుంబాలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. వీరికి నల్లా కనెక్షన్‌లు లేవు. వాటర్ వర్క్స్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. రోజుకు ఒకసారి ట్యాంకర్ వస్తుందని, సరిపోక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. కూలీకి వెళ్లకుండా నీటి ట్యాంకర్ కోసం ఎదురుచూస్తు కాలం వెళ్లదీస్తున్నారు. ప్రత్యేకంగా ఓ పబ్లిక్ నల్లా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అక్రమంగా ఇసుక నిల్వ

ఒకరిపై కేసు

చర్లపల్లి, ఫిబ్రవరి 14:నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇతరులకు అధిక ధరలకు విక్రయిస్తున్న ఓ వ్యక్తిపై కేసు నమోదైన సంఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కాప్రా సర్కిల్ పరిధిలోని మాధవపురి కాలనీకి చెందిన నీలపు అప్పన్న(53) గత కొంత కాలంగా కుషాయిగూడ చక్రీపురం చౌరస్తాలో తక్కువ ధరకు ఇసుకను కొనుగోలు చేసి ఒయాటీ కాలనీలో నిల్వ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఇసుక నిల్వ దగ్గర దాడి చేసి 14 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. ఇసుకను నిల్వ చేసిన అప్పన్నపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

త్రివేణి సంగమంలో పవిత్ర స్నానం

మహాకుంభ మేళా త్రివేణి సంగమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, సతీమణి మర్రి మమతారెడ్డి పవిత్ర స్నానం ఆచరించారు. శుక్రవారం ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహాకుంభ మేళా త్రివేణి సంగమంలో ఎమ్మెల్యే కుటుంబసభ్యులు పవిత్ర స్నానం ఆచరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలతోపాటు మల్కాజిగిరి నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని భగవంతున్ని ప్రార్థించారు. *– మల్కాజిగిరి, ఫిబ్రవరి 14*

రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు పరామర్శ



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ఎంపీ ఈటెల, మాజీ ఎమ్మెల్యే సుభాశ్ రెడ్డి

ఉప్పల్, ఫిబ్రవరి 14: నాచారం నుంచి కుంభమేళాకు వెళ్లి తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలను మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ శుక్రవారం నాచారంలోని ప్రమాద బాధితుల కుటుంబాలను పరామర్శించారు. వారి కుటుంబాలకు మనోధైర్యం తెలుపుతూ, వారికి అండగా ఉంటామని తెలిపారు. ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాశ్ రెడ్డి, ఏనుగు సుదర్శన్ రెడ్డి, వై.సత్యనారాయణ, మర్రి మోహన్ రెడ్డి, రవి నాయక్ మల్లెల నరసింగ్‌రావు, రాగిరి మోహన్ రెడ్డి, రవీందర్ రెడ్డి,అనిత పద్మారెడ్డి, ప్రకాశ్, నాచారం డివిజన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్, అభిషేక్ గౌడ్, అంజి, రాఘవేంద్ర రెడ్డి, రవి కాంత్, ఉదయ్, అమర్, వరలక్ష్మి, బాలు పాల్గొన్నారు.

బదిరుల మధ్య పఠాన్ ఉమ్మర్‌ఖాన్ జన్మదినం

నేరేడ్‌మెట్ శ్రీకాలనీలోని హెలెన్ కెల్లర్స్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్ ఫౌండర్ చైర్మన్ పఠాన్ ఉమ్మర్ ఖాన్ పుట్టినరోజును పఠాన్ సమ్మి ఉల్లాఖాన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. బదిరుల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. ఈ వేడుకల్లో హెల్లెన్ కెల్లర్స్ స్కూల్, జాన్ పీటర్ మెమోరియల్ జూనియర్ కాలేజీ, హెలెన్ కెల్లర్స్ ఇనిస్టిట్యూట్ బదిర విద్యార్థులు పాల్గొన్నారు. *– నేరేడ్‌మెట్, ఫిబ్రవరి 14*

స్వచ్ఛ సర్కిల్‌గా తీర్చిదిద్దేందుకు ఇంటింటి చెత్త సేకరణ చేపట్టాలి

సీసీఎస్ అధ్యక్షుడు ఎంపల్లి పద్మారెడ్డి

చర్లపల్లి, ఫిబ్రవరి 14: కాప్రా సర్కిల్‌ను స్వచ్ఛ సర్కిల్‌గా తీర్చిదిద్దేందుకు ఇంటింటి చెత్త సేకరణ పనులను నిత్యం చేపట్టేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని చర్లపల్లి కాలనీల సమాఖ్య అధ్యక్షుడు ఎంపెల్లి పద్మారెడ్డి పేర్కొన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని శివసాయినగర్‌లో స్వచ్ఛ ఆటోవాలాలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, పారిశుధ్య విభాగం అధికారి సుదర్శన్, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ పారిశుధ్య విభాగం అధికారుల పర్యవేక్షణ కొరవడంతో కాలనీల్లో ఇంటింటి చెత్తసేకరణ పనులు సక్రమంగా జరగడంలేదని, దీంతో కాలనీల్లో స్థానికంగా పలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ ఈస్ట్‌జోనల్ కమిషనర్, కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించి పారిశుధ్య సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్కిల్ ఎస్ఎఫ్ఏ లక్ష్మి, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు కొండగళ్ల అశోక్, బర్ల రామచంద్రారెడ్డి, అశోక్, రమేశ్, మంజుల, వరలక్ష్మి, వాసు, సత్యనారాయణలతో పాటు పారిశుధ్య సిబ్బంది, స్వచ్ఛ డ్రైవర్లు పాల్గొన్నారు.

చర్లపల్లి డివిజన్ శివసాయినగర్‌లో పారిశుధ్య అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న సీసీఎస్ ప్రతినిధులు, సిబ్బంది తదితరులు

సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి

అల్వాల్ డివిజన్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి

మల్కాజిగిరి, ఫిబ్రవరి 14: సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతను పాటించాలని అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్‌లో జరుగుతున్న సీసీ రోడ్ నిర్మాణ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అల్వాల్ డివిజన్‌లో కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేస్తామని, నిర్మాణ పనులను అధికారులు పరిశీలిస్తున్నారన్నారు. డివిజన్లోని అన్ని కాలనీలలో అధికారులతో సర్వే చేయించి అవసరమైన కాలనీల్లో సీసీ రోడ్లను నిర్మిస్తామని, గుంతలుపడిన రోడ్లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయిస్తామన్నారు.కార్యక్రమంలో లింగారెడ్డి, అరుణ్, సాజిద్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు జయప్రదం చేయాలి

మల్లాపూర్, ఫిబ్రవరి 14: మార్చి 1, 2 తేదీల్లో ఈసీఐఎల్‌లో జరగనున్న అఖిల భారతయువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవనంలో సమావేశాల గోడపత్రికను విడుదల చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు గిరి బాబు, శేఖర్, సాయిలు, శ్రీకాంత్, సుదర్శన్, విజయ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ కోర్సు వర్క్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పీహెచ్‌డీ కోర్స్ వర్క్ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్‌ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23, 2023-24 బ్యాచ్‌లకు చెందిన బ్యాక్లాగ్ అభ్యర్థులు తమ పరీక్ష ఫీజును వచ్చే నెల 12వ తేదీ లోగా సంబంధిత డీన్ కార్యాలయంలో చెల్లించాలని సూచించారు. ఈ పరీక్షలను మార్చి, ఏప్రిల్ నెలల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్సైట్ www. osmania. ac. in లో చూసుకోవాలని సూచించారు.

బీ ఫార్మసీ పరీక్ష ఫీజు స్వీకరణ గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ:ఉస్మానియా యూనివర్సిటీలోని బీఫార్మసీ పరీక్ష ఫీజు స్వీకరణ గడువును పొడిగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్‌ది ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ (పీసీఐ) 3, 5, 7 సెమిస్టర్ల మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్లాగ్ పరీక్ష ఫీజును ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 20వ తేదీ వరకు సంబంధిత కళాశాలలో చెల్లించవచ్చని చెప్పారు.

పలు పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్‌ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లమా ఇన్ హెల్త్ కేర్ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్సైట్ www. osmania. ac. in లో చూసుకోవాలని సూచించారు.

పుల్వామా జవాన్ల రుణం తీర్చలేనిది

విశ్రాంత ఆర్మీ ఉద్యోగులు, అరుంధతీనగర్ యూత్ సభ్యులు

జవహర్‌నగర్, ఫిబ్రవరి 14: పుల్వామా దాడిలో వీర మరణం పొందిన భారత జవాన్ల రుణం తీర్చలేనిదని, సైనికుల సేవలు వృథాగాపోవని సీఆర్‌పీఎఫ్ విశ్రాంత ఉద్యోగులు,అరుంధతీనగర్ యూత్ సభ్యులు అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ అరుంధతీనగర్‌లో పుల్వామా ఘటనలో మరణించిన వీరసైనికులకు నివాళిగా శుక్రవారం సీఆర్‌పీఎఫ్ విశ్రాంత ఉద్యోగులు, అరుంధతీనగర్ యూత్‌సభ్యుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూత్ అధ్యక్షుడు విక్రమ్ మాట్లాడుతూ.. సైనికుల అవిశ్రాంత పోరాటంతోనే దేశం సుభిక్షంగా ఉంటుందని, పుల్వామా దాడి ప్రతిఒక్కరిని కలచివేసిందని, వారి సేవలను స్మరించుకుందామన్నారు. సీఆర్‌పీఎఫ్ విశ్రాంత ఉద్యోగులు, యూత్ సభ్యులు మనోజ్, జానీ తదితరులు పాల్గొన్నారు.